క్లుప్తంగా

కుల ధ్రువీకరణ పత్రాలు ఎక్కడైనా పొందొచ్చు



ఇళ్ల భాస్కరరావు

దేవరపల్లి: అతిరాస కార్పొరేషన్‌లోని 18 ఉపకులాలకు రాష్ట్రంలో ఎక్కడైనా కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అతిరాస కులస్తులు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మాత్రమే ఉన్నట్లు గుర్తించి ప్రభుత్వం కుల ధ్రువీకరణ పత్రాల జారీకి ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. వీరికి ఇతర జిల్లాల్లో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా, అతిరాస కార్పొరేషన్‌లోని కులస్తులు రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఉన్నా అక్కడ అధికారులు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని జీఓ నంబరు 25ను ఈ నెల 10న విడుదల చేశారని అన్నారు. దీనిపై సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహాసభ విజయవంతం చేయండి

గోపాలపురం: విజయవాడలో ఈ నెల 30న జరిగే ఏపీ ఎమ్మార్పీఎస్ యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం గోపాలపురం ఉప్పరగూడెంలో జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. సంఘ జిల్లా నాయకుడు గెల్లా వెంకటశ్రీను మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును కేంద్రం ప్రవేశ పెట్టాలని డిమాండ్‌చేశారు. నాయకులు బొబ్బిలి వెంకట్రాజు, పత్తిపాటి రాంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నిడదవోలు: స్థానిక 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్లు నిడదవోలు విద్యుత్ శాఖ ఈఈ బి.వీరభద్రరావు గురువారం తెలిపారు. గణేష్‌చౌక్ సెంటర్ నుంచి గణపతి సెంటర్, మెయిన్‌రోడ్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఉండ్రాజవరం: స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.విశ్వప్రసాద్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల ప్లస్, జూనియర్ కళాశాలలో ఎంపీసీ, సీఈసీ విద్యార్థినులకు యూటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షుడు ఐ.రాంబాబు ఆర్థిక సహకారంతో స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేశారు. రాంబాబును పేరెంట్స్ కమిటీ చైర్మన్ కరెళ్ల సోంబాబు, ఉపాధ్యాయులు మాణిక్యాలరావు, నిరీక్షణ రాజు, మహేష్, రామ్‌ప్రసాద్ తదితరులు అభినందించారు.

కల్యాణం... వైభోగం



గజ్జరంలో కలశపూజకు ఏర్పాటు చేసిన మండపం

చాగల్లు: స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. భద్రాచలం రామాలయం నుంచి తీసుకువచ్చిన సీతారాముల కల్యాణ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వేదపండితుడు లింగాల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిగింది. హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

తాళ్లపూడి: గజ్జరంలో కలశ పూజా మహోత్సవం ఘనంగా జరిగింది. తొలుత గ్రామంలో అయ్యప్ప మాలధారులు కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనిపెద్ది రామలింగేశ్వరశర్మ, రాజేష్‌శర్మ, గురుస్వామి గోకవరపు శ్రీనివాస్, గ్రామ స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశపూజ జరిగింది. గురుస్వాములు కలిశెట్టి సన్యాసినాయుడు, మరిచర్ల వెంకటేశ్వరరావు, మరిచర్ల వెంకట శ్రీనివాస్‌స్వామి పాల్గొన్నారు.

దేవరపల్లి: స్వామియే శరణం అయ్యప్ప అంటూ ఆ స్వామివారిని భక్తులు మనసారా కొలిచారు. దేవరపల్లిలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి పడిపూజ వైభవంగా జరిగింది. 18 మెట్లకు పూజలు చేసి హారతులు ఇచ్చారు. గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ప్రతిభ

కొవ్వూరు: ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–14 వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు కాంస్య పతకం వచ్చింది. ఈ పోటీల్లో ఐ.పంగిడి హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి కొడమంచిలి మహి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది.

నిడదవోలు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కాటకోటేశ్వరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఐ.లలిత రమణి గురువారం తెలిపారు. అండర్–14 బాలికల విభాగంలో కారింకి వెంకట సత్యవతి, అండర్–17లో తన్నీరు సుప్రియ ఈ నెల 24 నుంచి 26 వరకూ చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

మురుగు సమస్యకు మోక్షం

- రూ.2 కోట్లతో అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం
- శరవేగంగా జరుగుతున్న పనులు
- మంత్రి చొరవతో అభివృద్ధి



కొవ్వూరు పట్టణంలో నందమూరు రోడ్డు వద్ద అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం

కొవ్వూరు: ఏళ్ల కాలం నాటి సమస్యకు మోక్షం కలుగుతోంది.. మురుగు వెతలు తీర్చేందుకు శరవేగంగా డ్రెయిన్ నిర్మాణం జరుగుతోంది.. కొవ్వూరు పురపాలక సంఘంలో చాలాకాలంగా అసంపూర్తిగా ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం రూ.2 కోట్ల స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులతో ఈ పనులు చేపట్టారు. స్థానిక నందమూరు రోడ్డులో కేజీఎం స్కూల్ దాటిన తర్వాత అపార్ట్‌మెంట్ నుంచి ఒకవైపు, అచ్చాయ్యమ్మ కాలనీ జంక్షన్ సమీపం నుంచి మరోవైపు డ్రెయిన్‌ను ఒక్కో వైపు 620 మీటర్ల పొడవున నిర్మిస్తున్నారు. 2015 గోదావరి పుష్కరాల సమయంలో ఈ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌కు నిధులు మంజూరైనా అప్పటి టీడీపీ ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసి చేతులు దులుపుకొంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు మంజూరు చేయించారు. ఈ మేజర్ డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఇది పూర్తయితే పట్టణంలో మురుగు సమస్యకు కొంతవరకూ మోక్షం కలుగుతోంది. ప్రస్తుతం నందమూరు రోడ్డు మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఇంటి దగ్గర నుంచి పట్టణ శివారు వరకూ రోడ్డుకు ఇరువైపులా మొదటి విడతగా అవుట్‌పాల్ డ్రెయిన్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ఒకవైపు పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

గత ప్రభుత్వ తప్పిదాలతో..

అప్పటి టీడీపీ ప్రభుత్వంలో కొవ్వూరు నుంచి నందమూరు రోడ్డు జంక్షన్ వరకూ ఇరువైపులా అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పట్టణంలో నందమూరు రోడ్డులో ఉన్న అప్పటి మంత్రి కేఎస్ జవహర్ ఇంటి వరకూ పనులు పూర్తిచేసి వదిలేశారు. ఎక్కడైనా రోడ్డు లేక డ్రైన్ పనులు చేపడితే ఒకవైపు నుంచి ప్రారంభించి మరోవైపు ముగిస్తారు. టీడీపీ ప్రభుత్వంలో మాత్రం పట్టణం వైపు నుంచి పనులు ప్రారంభించి ఆ పార్టీ మాజీ మంత్రి ఇంటి వరకూ పూర్తిచేసి వదిలేశారు. అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం నందమూరు రోడ్డు జంక్షన్ వరకూ చేపట్టాల్సి ఉంది. సుమారు రెండు కిలోమీటర్ల పొడవున ఉండే ఈ డ్రెయిన్‌ను మధ్యలో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు, టీడీపీ నేతల పొలాల ధరలు పెంచుకునేందుకే మధ్యలో నుంచి పనులు ప్రారంభించారు. తమకు అనుకూలమైనంత వరకూ పనులు పూర్తి చేసుకున్నారు. ఇదే పనులు పట్టణం వైపు నుంచి చేసి ఉంటే ప్రజలకు ఉపయోగకరంగా ఉండేది. టీడీపీ ప్రభుత్వం మాత్రం తమ స్వార్థ ప్రయోజనాల కోసం మధ్యలో కొంతదూరం చేపట్టి అసంపూర్తిగా విడిచిపెట్టిందని స్థానికులు విమర్శిస్తున్నారు. పుష్కరాలు ముగిసిన తర్వాత నాలుగేళ్లపాటు ఆ పార్టీ అధికారంలో ఉన్నా ఏ రోజూ అవుట్‌ఫాల్ డ్రెయిన్ పనుల ఊసెత్తలేదు. ప్రస్తుతం ఈ పనులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూర్తి చేసేందుకు కార్యాచరణ చేపట్టింది.



పట్టణ శివారు పొలాల వద్ద అసంపూర్తిగా డ్రెయిన్



కొవ్వూరు శివారులో అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మించకుండా వదిలేసిన ప్రాంతం

ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం



కుళాయిలు, పైపులైన్ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా చిలకపాడులో రూ.30 లక్షలు, చివటంలో రూ.2.46 కోట్లు, తాడిపర్రులో రూ.2.25 కోట్లతో నిర్మించనున్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్, కుళాయిలు, పైపులైన్ పనులకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో తాగునీటి ఇబ్బందులను తీర్చడానికి ప్రభుత్వం ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, చిలకపాడు సర్పంచ్ తిరుమళ్ల సూర్యకుమారి, ఎంపీటీసీ సభ్యులు తిరుమళ్ల నాగపార్వతి, కట్టా వెంకటేశ్వరరావు, చివటం, తాడిపర్రు సొసైటీ అధ్యక్షులు కఠారు సత్యనారాయణ, అక్కిన రామకృష్ణ, పింద్ర పోసియ్య, కరుటూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓ మంచి నేస్తం.. పుస్తకం



పిట్టల వేమవరంలో పుస్తక పంపిణీ కేంద్రం ప్రారంభానికి అనుమతి పత్రాలను అందిస్తున్న గ్రంథాలయాధికారి వెంకటేశ్వర్లు



నల్లజర్లలో గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

- గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుందాం
- వారోత్సవాల్లో వక్తల పిలుపు

పెరవలి: పుస్తకాలే ఓ మంచి నేస్తాలని, గ్రంథాలయాల్లో పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన సాధ్యమని పెరవలి గ్రంథాలయాధికారి కె.వెంకటేశ్వర్లు అన్నారు. పిట్టల వేమవరంలో కొత్తగా పుస్తక పంపిణీ కేంద్రాన్ని గురువారం సర్పంచ్ మండ హైమావతి, చిన్న, వైఎస్సార్ సీపీ నాయకుడు కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పుస్తక పంపిణీ కేంద్రం ద్వారా నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నాయకులు రుద్రరాజు దిలీప్, చంటిరాజు, పంచాయతీ కార్యదర్శి భరత్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని స్థానిక బాలికల జూనియర్ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు కోట రామ్‌ప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో 6, 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుడు గుత్తికొండ కృష్ణారావు, సభ్యులు ఆకెళ్ల శ్రీనివాసు పాల్గొన్నారు.

నిడదవోలు: స్థానిక శాఖా గ్రంథాలయంలో పలువురు వక్తలు మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య గ్రామ గ్రామాన గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేశారని కొనియాడారు. రిటైర్డ్ టీచర్ పొన్న కృష్ణబాబు, కుందుల ప్రభాకరం, ఉవీ రమణ, రావి లక్ష్మీశ్రీనివాసరావు, ఏలూరిపాటి సుబ్బలక్ష్మి, గ్రంథాలయాధికారి కుంచె చినబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

నల్లజర్ల: స్థానిక బీఆర్ అంబేడ్కర్ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య సంస్మరణ సభ జరిగింది. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. రిటైర్డ్ టీచర్ రామరాజు, గ్రంథపాలకురాలు ఏవీ రమణ పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు, చంద్రవరం శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, గ్రంథాలయాల పంచ సూత్రాల రూపశిల్పి రంగనాథన్ తదితరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. గ్రంథ పాలకులు కె.సుమన్‌కుమార్, గద్దే శ్రీనివాసరావు, రిటైర్డ్ లైబ్రేరియన్ కె.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ విశిష్టతను తెలియజేస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎ.నరేష్ , జి.రాజ్‌కుమార్, సిద్ధాంతి పి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, జి.రాఘవరావు పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వివేకానంద యువజన సమితి అధ్యక్షుడు ఎస్.రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ విభాగంలో 80 మంది పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రేరియన్ జె.ఉదయశ్రీ, శాఖా గ్రంథాలయ అధికారి జీవీవీఎస్ త్రినాథ్ పర్యవేక్షించారు.

బైక్ రేసింగ్‌తో తంటా



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉల్లూరి శ్రీనివాసరావు

- దివ్యాంగుడిని ఢీకొన్న బైక్
- కేసు నమోదు చేసిన పోలీసులు

నిడదవోలు: బైక్ రేసింగ్‌లు అమాయకుల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నిడదవోలు వైఎస్సార్ కాలనీలో 12న దీపావళి రోజు రాత్రి దివ్యాంగుడు వల్లూరి శ్రీనివాసరావు బంధువులతో ఆనందంగా గడిపి, పాలప్యాకెట్ల కోసం అక్కడి వినాయక గుడి వద్ద దుకాణానికి వచ్చాడు. రోడ్డు పక్కన నిలబడి ఉన్న అతన్ని వేగంగా వచ్చిన బైక్ ఢీకొంది. దీంతో శ్రీనివాసరావు ఎగిరి కిందపడ్డాడు. వెనుక నుంచి మరో బైక్ వచ్చి అక్కడున్న వారిని ఢీకొంది. ఒక బైక్‌పై ఇద్దరు, మరో బైక్‌పై ముగ్గురు కుర్రోళ్లు ఉన్నారు. శ్రీనివాసరావు కాలు విరగడమే కాకుండా, పొట్టలోని పేగులు బయటకు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న అతని బంధువులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బైక్ నడిపిన యువకుడు బషీర్‌కు కూడా గాయాలు కావడంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పట్టణంలోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో రోజువారీ కూలీగా పనిచేస్తున్న దివ్యాంగుడు శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నిడదవోలు పట్టణ ఎస్సై పి.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్తంభించిన ట్రాఫిక్

కొవ్వూరు: బల్లిపాడు ఇసుక ర్యాంపు నుంచి కుమారదేవం వరకూ గురువారం ట్రాఫిక్ స్తంభించింది. ఇసుక ర్యాంపునకు భారీగా లారీలు తరలిరావడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. దీనికితోడు సాయంత్రం కావడంతో స్కూల్, కళాశాల బస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. బల్లిపాడు ర్యాంపు నుంచి వేగేశ్వరపురం వరకూ, ఇటు కొవ్వూరు వైపు కుమారదేవం వరకూ వందలాది వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. సుమారు రెండు గంటల పాటు ఈ పరిస్థితి ఎదురైంది.

ప్రజాదరణే మా ధైర్యం



కానూరులో ర్యాలీగా ఇంటింటికీ వెళ్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు వస్తున్న ప్రజాదరణే తమ పార్టీకి బలం, ధైర్యమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. గురువారం కానూరు సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కానూరులో పథకాల ద్వారా ప్రజలకు రూ.35 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.25.52 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఇంతటి అభివృద్ధి ఎప్పుడూ జరగలేదని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయలేకపోయిందని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నూరు శాతం హామీలు అమలయ్యాయన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ కార్పెర్ల ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు కొమ్మిశెట్టి రాము, మండల యూత్ అధ్యక్షుడు తోట సురేష్, మండల గృహ సారథుల అధ్యక్షుడు రామగుడుల సూర్యనారాయణ పాల్గొన్నారు.

నల్లజర్ల: తూర్పుచోడవరంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఎంపీటీసీ సభ్యురాలు బోడసాని సునీత, గ్రామ నాయకుడు గన్నమని సుబ్బారావు అధ్యక్షత వహించారు. సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబు హామీలిచ్చి మోసం చేసిన తీరు, ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను ఏవిధంగా నెరవేస్తూ సుపరిపాలన సాగిస్తున్నారో ప్రజలకు వివరించారు. ఈఓపీఆర్డీ సింహాద్రి మాట్లాడుతూ గ్రామంలో వివిధ పథకాల కింద రూ.32.40 కోట్లు ఖర్చు చేశామన్నారు. మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. నాయకులు ముప్పిడి వెంకటరత్నం, భోగవల్లి శ్రీరామారావు, చిక్కం గంగారావు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనే రావాలి

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. గోపవరం సచివాలయ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపవరంలో రూ.22.16 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.3.47 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలకు సంబంధించిన సమాచార బోర్డులను పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్యలు ఆవిష్కరించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు తోలేటి శ్రీను, సచివాలయ కన్వీనర్ ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, కాలాబత్తుల సుజాత, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు పాల్గొన్నారు.



తూర్పుచోడవరంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



మోర్తలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరామయ్య

చాగల్లు: స్థానిక సచివాలయం–2 పరిధి పాతమ్మపేటలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు అందించిన సంక్షేమ వివరాలతో కూడిన సమాచార బోర్డును ఆవిష్కరించారు. పార్టీ నాయకుల ఇళ్ల వద్ద పల్లెనిద్ర చేశారు. పార్టీ మండల గౌరవాధ్యక్షుడు జుట్టా ఏడుకొండలు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ ఊబా దుర్గారావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య అన్నారు. మోర్త సచివాలయం–1 వద్ద సర్పంచ్ చిటికెన సుజని, సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి నరేంద్ర ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి ఆవిష్కరించారు. పార్టీ పతాకాన్ని గ్రామ పార్టీ అధ్యక్షుడు చిటికెన సూరిబాబు ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు జానీ నాగలక్ష్మి, వెలిగట్ల రాణి, వైస్ సర్పంచ్ దాపర్తి రామ్ సందీప్, సిద్ధార్థరాజు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా..

పెరవలి: నిడదవోలు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని, ఇందులో భాగంగా రూ.2 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పనులు చేశామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. గురువారం కానూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో దోచుకో–దాచుకో అన్నట్లు పాలన సాగిందని ఆరోపించారు. అప్పట్లో పేదలకు ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వలేదన్నారు. జనసేన, టీడీపీలు ఉనికి కోసమే పాకులాడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి రూ.వేల కోట్లు వెచ్చిస్తుంటే ప్రతిపక్షాలు అభివృద్ధిని అడ్డుకోవాలని కోర్టుల్లో కేసులు వేస్తున్నాయని అన్నారు. కానూరులో అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాలకు ప్రభుత్వం రూ.35 కోట్లు ఖర్చు చేసిందన్నారు. పేదల ఇంట వెలుగులు తెచ్చేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ఎంపీపీ కార్పెర్ల ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు వీరమళ్లు సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజనీ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్టి రాంబాబు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కొమ్మిశెట్టి రాము, సర్పంచ్ భావన మధు, తోట సురేష్, అంబటి బ్రహ్మయ్య, కరుటూరి గోపి పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ



చిన్నాయిగూడెంలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని చిన్నాయగూడెం గ్రామ సచివాలయం–1 పరిధి అంబేడ్కర్ సెంటర్లో నిర్వహించారు. అక్కడ వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి గడా జగదీష్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడారు. ఎన్నికల సమయంలో పేదలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. కరోనా కష్టకాలంలోనూ పథకాలను నిర్విరామంగా కొనసాగించారన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. చిన్నాయగూడెంలో రూ.60 కోట్ల విలువైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు టి.మహేంద్రకుమార్ ఇంటి వద్ద పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గడా రాంబాబు, ఆచంట అనసూయ, గ్రామ కమిటీ అధ్యక్షుడు తాడిమళ్ల మహేంద్రకుమార్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు పాల్గొన్నారు.

గోపాలపురం: గుడ్డిగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమాన్ని అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల పార్టీ కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా అధ్యక్షురాలు యండపల్లి కవిత, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ మడిచర్ల ప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ తోట నాగేశ్వరరావు, ధూళిపాల ప్రభాకర్ పాల్గొన్నారు.